RNI NO: APTEL/26/A3560

www.mahinewsindia.com

# మహి న్యూస్



MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 149 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య పేజీలు : 4 వెల రూ. 2 శుక్రవారం -09 - అక్టోబర్ - 2026

Published From :Kurnool circulated by YSR Kadapal Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

## అమిత్ షాతో సీఎం చంద్రబాబు భేటీ..

# పెండింగ్ అంశాలపై వినతి

### ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు భేటీ

- ★ దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశం అంశాలపై ప్రస్తావన
- ★ గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై ప్రత్యేకంగా విజ్ఞప్తి



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలకమైన పెండింగ్ అంశాలపై ఈ భేటీలో చర్చించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై కేంద్రం దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చిన విషయాన్ని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ బృహత్తర ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అమిత్ షాను ఆయన విజ్ఞప్తి చేశారు. జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన ఇతర అంశాల పురోగతిపై కూడా ఈ సందర్భంగా సమీక్ష జరిపినట్లు సమాచారం. రాష్ట్ర విభజన హామీలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించడంలో కేంద్రం సహకరించాలని చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది.



### స్థానిక ఎన్నికల్లో వైసీపీని అడ్డుకునేందుకు కుట్ర జరుగుతోంది: అంబటి రాంబాబు

- వైసీపీ అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా అధికారులపై ఒత్తిడి చేస్తున్నారన్న అంబటి
- సీఎం, మంత్రి లోకేశ్ ఆదేశాలతోనే ఇదంతా జరుగుతోందని ఆరోపణ
- నామినేషన్లు తిరస్కరిస్తే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిక

### అమరజీవి జలధారకు

## నిధులు ఇవ్వాలి

ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ.. పోలవరం, జలధారపై కీలక చర్చ



- ఢిల్లీ పర్యటనలో బిజీగా గడుపుతున్న చంద్రబాబు
- కీలక ప్రాజెక్టుల పురోగతిని సీఆర్ పాటిల్‌కు వివరించిన చంద్రబాబు
- రాష్ట్రంలోని 95 లక్షల గ్రామీణ కుటుంబాలకు గాను ఇప్పటికే 62 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్ష

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాసేపటి క్రితం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు.



### సీఎం అయ్యాక నన్ను స్టింగ్ ఆపరేషన్‌తో ఇరికించే ప్రయత్నం.

డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు

- తన వద్ద ఫొటోలు, పత్రాలు ఉన్నాయని వెల్లడి
- పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ప్రకటన
- స్టింగ్ వెనుక ఉన్నవారు ఎవరో తెలుసన్న సీఎం
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- తనతో పాటు మరికొందరిపై స్టింగ్ జరుగుతున్నాయని ఆరోపణ



### బాలీవుడ్‌లో విషాదం.. ప్రముఖ నటుడు

# నానా పటేకర్ కన్నుమూత

బాలీవుడ్ నటుడు నానా పటేకర్ (75) గుండెపోటుతో కన్నుమూత

హైదరాబాద్: భారతీయ సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నటుడు నానా పటేకర్ (75) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. గోవాలోని తన నివాసంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో మిగతా 2 లో

- గోవాలోని తన నివాసంలో అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రికి తరలింపు
- తెల్లవారుజామున 5:20 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు వెల్లడి
- మూడు జాతీయ అవార్డులు, పలు ఫిలింఫేర్ పురస్కారాలు అందుకున్న నానా

## మొబైల్ ఫోన్ ఇప్పుడు

# సుపరిపాలనకు సాధనం

### దేశంలోని ప్రతీ జిల్లాకు 5జీ సేవలు విస్తరించాయన్న మోదీ

- మొబైల్ ఇంటర్నెట్ వేగం 2022తో పోలిస్తే 10 రెట్లు పెరిగిందని వెల్లడి
- డిజిటల్ ఇండియా ద్వారా సాంకేతిక అంతరాలను తగ్గించామన్న ప్రధాని
- కోవిడ్ సమయంలో డిజిటల్ వ్యవస్థ దేశాన్ని నడిపించిందని వ్యాఖ్య



ఢిల్లీ: భారత టెలికాం రంగం కేవలం నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని, సుపరిపాలన, ప్రభుత్వ సేవలను ప్రజలకు మిగతా 2 లో

### ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు

# కుట్ర పన్నుతున్నారు

మూడోరోజు మొదలైన నిరసనలు.. రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

- "300 మంది ఎంపీలం ప్రశాంతంగా ఆందోళన చేయాలనుకుంటున్నాం
- నిరసనల వేళ.. జ్ఞానేశ్ కుమార్ నియామకంపై సుప్రీంలో పిటిషన్
- మొదటి రోజు మమ్మల్ని ఎన్నికల సంఘం వద్దకు వెళ్లకుండా ఆపారు



ఢిల్లీ: ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ.. దేశ రాజధాని దిల్లీలో కాంగ్రెస్ సహా మిగతా 2 లో



### తెలంగాణలో మండుతున్న ఎండలు.. పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత

- తెలంగాణలో మళ్లీ పెరిగిన ఎండల తీవ్రత
- ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభం

హైదరాబాద్: తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల

## ప్రధాని మోదీ కనుసన్నల్లో

# ఈసీ అధికారులు పని చేస్తున్నారు

### భవిష్యత్తులో నరేంద్ర మోదీని అధికారంలో నుంచి దించడానికి దారితీస్తుంది

- రాహుల్, ప్రియాంకలపై పోలీసుల దాడి మోదీ, అమిత్ షా అసహనానికి నిదర్శనం
- దేశంలో పౌరుల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ కుట్ర పన్నుతోంది
- దేశ ప్రజలను రెండు వర్గాలుగా విభజించేందుకు కేంద్రం ప్రమాదకర క్రీడకు తెరలేపింది
- ప్రధాని మోదీ ఆదేశాల మేరకే సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వ్యవహరిస్తున్నారు



న్యూఢిల్లీ: దేశంలో పౌరుల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ కుట్ర పన్నుతోందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ కనుసన్నల్లోనే ఎన్నికల సంఘం అధికారులు పనిచేస్తున్నా రని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో తప్పు లు చేసిన వారిని వదిలేసి, ఆ తప్పు లను సరిదిద్దాలని డిమాండ్ చేసిన రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లి కార్జున ఖర్గేలతో పాటు ఇండియా కూటమి నేతలను అరెస్టు చేయడం ప్రజా స్వామ్యాన్ని అపహా స్యం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్, ప్రియాంకలపై పోలీసుల దాడి మోదీ, మిగతా 2 లో

## రైతులకు బేడీలా?

### కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం



- జూరాల నీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు నమోదు
- ప్రభుత్వ చర్యపై తీవ్రంగా మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు
- ఇది ప్రజా పాలన కాదు, ప్రజా పీడన అంటూ విమర్శలు
- రైతులపై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- లేదంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక

మహి న్యూస్
www.mahinewsindia.com
MAHI NEWS Epaper: https://epaper.mahinewsindia.com తెలుగు దినపత్రిక



# 'బిల్డ్ ఏపీ' నినాదంతో ముందుకు వెళుతున్నాం

అమరావతి: 'బిల్డ్ ఏపీ' నినాదంతో ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో దేశంలోనే అగ్రగామి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు వివరించారు. గత 28 నెలల్లో రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చంద్రబాబు తెలిపారు. కేవలం అవగాహన ఒప్పందాల (ఎంఓయూ)కే పరిమితం కాకుండా, వాటిని వాస్తవ పెట్టుబడులుగా మార్చేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఎస్క్రో ఖాతాను నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. పెట్టుబడులకు అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమలకు అన్ని అనుమతులు వేగంగా అందిస్తున్నామని తెలిపారు.

## వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు

నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నీటి కొరత తీర్చవచ్చని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా, రాష్ట్రాన్ని సౌత్‌ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా మార్చడమే ధ్యేయమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 110 గిగావాట్లకు ఒప్పందాలు కుదిరాయని, ప్రత్యేక ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దుగరాజపట్నం, మచిలీపట్నంలో షిప్ బిల్డింగ్ కేంద్రాలు, తిరుపతి, కొప్పర్తిలలో ఎలక్ట్రానిక్స్, డ్రోన్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పాలనలో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నామని, అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం అభినందనీయమని, పోలవరం, అమరావతి నిర్మాణానికి అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

భారత ప్రగతిలో ఏపీది కీలక పాత్ర: పీయూష్ గోయల్

ఈ కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, భారత అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్‌ది చారిత్రక పాత్ర అని కొనియాడారు. శాతవాహనుల కాలం నుంచే ఆంధ్ర ప్రాంతం నౌకా వాణిజ్యానికి ప్రసిద్ధి అని గుర్తుచేశారు. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "టీమ్ ఇండియా"గా కలిసి పనిచేస్తున్నాయని, కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని అన్నారు. 'ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష' అనే విధానాలతో దేశం ముందుకు సాగుతోందని, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తులు కాదు, వ్యవస్థే ముఖ్యం
# ఐటీడీపీకి నారా లోకేశ్ దిశానిర్దేశం

అమరావతి: వ్యక్తులు కాదు, వ్యవస్థే ప్రధానమనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ ఐటీ వింగ్ (ఐటీడీపీ) పనిచేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఐటీడీపీ విభాగంపై నారా లోకేశ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఐటీడీపీ ఒక వారధిగా నిలవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలకు వివరిస్తూనే, సోషల్ మీడియాలో ప్రత్యర్థులు చేసే అసత్య ప్రచారాలను ఆధారాలతో సహా తిప్పికొట్టాలని స్పష్టం చేశారు. ఐటీడీపీ కమిటీల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని లోకేశ్ ఆదేశించారు. విభాగంలోని ప్రతి సభ్యుడిని 'మై టీడీపీ యాప్'తో అనుసంధానించాలని స్పష్టం చేశారు. పార్టీలోని ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఐటీడీపీ మరింత పటిష్ఠంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ముఖ్యనేత చింతకాయల విజయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## డిజిటల్ మౌలిక సదుపాయాల్లో
# ఇండియా నెంబర్1: చంద్రబాబు

ఢిల్లీ: డిజిటల్ మౌలిక సదుపాయాల విషయంలో ఇండియా నంబర్ 1గా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. భారత్‌లో సింగిల్ పవర్ గ్రిడ్ ఉందని, అమెరికాలో కూడా ఇది లేదని చెప్పారు. రోడ్ గ్రిడ్ విషయంలో భారత్ రెండో స్థానంలో ఉన్నట్లు చెప్పారు. విశాఖలో నవంబర్‌లో నిర్వహించే పెట్టుబడుల సదస్సుకు సన్నాహకంగా దీల్లీలో ఏర్పాటు చేసిన సీఐఐ సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. సీఐఐతో మూడు దశాబ్దాలుగా అనుబంధం ఉన్నట్లు గుర్తు చేశారు. "1895లో సీఐఐ కోల్‌కతాలో ఏర్పాటైంది. 1996 ప్రాంతంలో నేను సీఐఐని ప్రమోట్ చేశాను. 1990లో వచ్చిన ఐటీ విప్లవాన్ని నేను అందిపుచ్చుకున్నా. ఐటీ కేంద్రంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేశా. నేను తీసుకున్న చర్యల వల్ల ఇప్పుడు తెలంగాణ తలసరి ఆదాయంలో నంబర్1గా ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారాం. పెట్టుబడిదారులు అనుమతి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేదు. అంతా ఆన్‌లైన్‌లోనే. రియల్ టైమ్‌లో పరిష్కరించేలా చర్యలు చేపట్టాం. ఏపీలో డిజిటల్ హబ్, డేటా సెంటర్లు వస్తున్నాయి. ఇటీవలే రాయలసీమ ప్రాంతంలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును ప్రారంభించాం. రాష్ట్రంలో సముద్ర తీరాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రచిస్తున్నాం. ప్రతి 50 కి.మీ.కు పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ ఉండేలా ప్లాన్ చేస్తున్నాం. పోర్టుల అనుసంధానానికి, కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశాం. పుట్టపర్తిలో డిఫెన్స్, ఏరోస్పేస్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. అతిపెద్ద రక్షణ తయారీ కేంద్రానికి రాష్ట్రంలో అడుగులు పడ్డాయి. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా రంగాల్లో రాష్ట్రం నుంచి ఎగుమతులకు చర్యలు చేపట్టాం. పరిపాలనలో సాంకేతికత, కృత్రిమ మేధస్సు జోడించి సేవలు వేగవంతం చేశాం. రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీతో సేవల వేగవంతానికి చర్యలు చేపట్టాం. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్ ప్రారంభానికి చర్యలు ప్రారంభించాం. అమరావతిని గ్లోబల్ టెక్ కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నాం" అని తెలిపారు.

## హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'సేవ్ డెమోక్రసీ'
# ర్యాలీలో ఉద్రిక్తత.. పలువురు నేతల అరెస్ట్

హైదరాబాద్: 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. లోక్‌భవన్ వద్దకు ర్యాలీ చేరుకున్న సమయంలో పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, కూటమి నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని డీసీఎంలో తరలించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై ఇండియా కూటమి అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా 'సేవ్ డెమోక్రసీ' కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిరసనలు చేపట్టాలని కూటమి గతంలో కార్యాచరణ రూపొందించింది. మరోవైపు ఢిల్లీలోనూ ఇండియా కూటమి తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో కూటమి నేతలకు విందు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో మరో నిరసన చేపట్టే అవకాశం ఉందని సమాచారం.

# జూనియర్ ఎన్టీఆర్ అభిమానులపై సీపీ సజ్జనార్ ఆగ్రహం.. కారణమిదే!

హైదరాబాద్: జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల తీరుపై పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ఫొటోను మార్ఫింగ్ చేసి, ఒక ఫేక్ చిత్రాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ విషయాన్ని నేరుగా నటుడు జూనియర్ ఎన్టీఆర్ దృష్టికి తీసుకెళ్తూ ఆయన అధికారిక 'ఎక్స్' ఖాతాను ట్యాగ్ చేయడం గమనార్హం. ఇటీవల 'చుట్టమల్లే' పాట వివాదానికి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు 'సౌత్ డిజిటల్ మీడియా' అనే ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ ప్రత్యక్షమైంది. దీనికి జత చేసిన ఫొటోలో, ఒక వ్యక్తికి ముసుగు వేసి ఉండగా, ఆయన పక్కన పోలీసులు, కొందరు ఎన్టీఆర్ అభిమానులు ఉన్నట్లు కనిపించింది. ఈ ఫొటోలో కమిషనర్ సజ్జనార్ చిత్రం కూడా ఉంది. ఇది కొద్దిసేపట్లోనే వైరల్ కావడంతో సజ్జనార్ స్పందించారు. వైరల్ అవుతున్న ఆ ఫొటో నిజమైనది కాదని, అది పూర్తిగా ఏఐతో సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ కంటెంట్‌ను చూసి మోసపోవద్దని, వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఫార్వర్డ్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతీదాన్ని గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. ఈ ఫేక్ ఫొటోను కొందరు ఎన్టీఆర్ అభిమానులే ప్రచారంలోకి తెచ్చినట్లు గుర్తించిన సజ్జనార్.. "మీ అభిమానుల్లో కొందరు నా ఫొటోను ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్న అంశాన్ని దయచేసి గమనించండి" అంటూ జూనియర్ ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేస్తూ కోరారు. సైబర్ నేరాలు, డీప్‌ఫేక్‌లపై నిరంతరం ప్రజలను అప్రమత్తం చేసే సజ్జనార్ స్వయంగా ఇలాంటి ఫేక్ ప్రచారానికి గురికావడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఏఐని ఆయుధంగా వాడుతూ తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# ప్రధాని మోదీ కనుసన్నల్లో ఈసీ అధికారులు పని చేస్తున్నారు

న్యూఢిల్లీ: దేశంలో పౌరుల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ కుట్ర పన్నుతోందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ కనుసన్నల్లోనే ఎన్నికల సంఘం అధికారులు పనిచేస్తున్నా రని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో తప్పు లు చేసిన వారిని వదిలేసి, ఆ తప్పు లను సరిదిద్దాలని డిమాండ్ చేసిన రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లి కార్జున ఖర్గేలతో పాటు ఇండియా కూటమి నేతలను అరెస్టు చేయడం ప్రజా స్వామ్యాన్ని అపహా స్యం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాహుల్, ప్రియాంకలపై పోలీసుల దాడి మోదీ, అమిత్ షాల అసహ నానికి నిదర్శన మని విమర్శించారు. దేశంలో ప్రతిపక్ష నేతలపై ఇలాంటి దాడులు జరగ డం ప్రజాస్వామ్యానికి చీకటి రోజని అభి వర్ణి ంచారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్‌చేస్తూ.. జంతర్‌మంతర్ వద్దకు బయలుదేరిన రాహుల్, ప్రియాంక తదితర లను పోలీసులు అరెస్టు చేసి పార్లమెంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. కేరళ సీఎం వీడీ సతీశన్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలతో కలిసి వారిని కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లా డారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, ఖర్గేను అరెస్టు దారుణమని మండిపడ్డారు.

ప్రజలను రెండు వర్గాలుగా విభజించే యత్నం

దేశ ప్రజలను రెండు వర్గాలుగా విభజించేందుకు కేంద్రం ప్రమాదకర క్రీడకు తెరలేపిందని సీఎం విమర్శించారు. ఓటు హక్కు ఉన్నవారు, ఓటు హక్కు లేని పౌరులుగా దేశాన్ని విడగొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఆదేశాల మేరకే సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వ్యవహరి స్తున్నారని, ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

'సైమన్ గో బ్యాక్' తరహాలోనే

నాడు స్వాతంత్య్ర పోరాటంలో 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం విధంగా దేశానికి స్వాతంత్య్రం తెచ్చిందో, నేడు జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ చేస్తున్న ఈ ఆందోళన కూడా భవిష్యత్తులో నరేంద్ర మోదీని అధికారంలో నుంచి దించడానికి దారితీస్తుందని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్‌ను వాడుకుని ఓట్లను తొలగించడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ఈ అప్రజాస్వామిక విధా నాలపై దీర్ఘకాలిక కార్యాచరణతో పోరాడతా మని, ప్రజలందరినీ ఏకం చేసి ఈ కుట్ర లను మూకుమ్మడిగా తిప్పికొడతామన్నారు.

## మొబైల్ ఫోన్ ఇప్పుడు
# సుపరిపాలనకు సాధనం: ప్రధాని మోదీ

ఢిల్లీ: భారత టెలికాం రంగం కేవలం నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్, ఇంటర్నెట్ వేగానికే పరిమితం కాలేదని, సుపరిపాలన, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో మొబైల్ కనెక్టివిటీ ఒక కీలక శక్తిగా ఆవిర్భవించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. నేడు ఢిల్లీలో ప్రారంభమైన 10వ 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' (ఐఎంసీ) 2026 సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో మొబైల్ ఫోన్లు సాధారణ కమ్యూనికేషన్ పరికరాల స్థాయి నుంచి సుపరిపాలనను అందించే ముఖ్యమైన సాధనాలుగా రూపాంతరం చెందాయని అన్నారు. 'మొబైల్ ఫోన్ ఇప్పుడు సుపరిపాలనకు ఒక సాధనంగా మారింది' అని ఆయన పేర్కొన్నారు. భారత టెలికాం ప్రస్థానంలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని ప్రధాని గుర్తుచేశారు. "2022లో ఇదే వేదికపై దేశంలో 5జీ సేవలను ప్రారంభించాం. 2023 నాటికి 5జీని దేశవ్యాప్తంగా విస్తరింపజేయడంలో ముందడుగు వేశాం. ఈ రోజు దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరింది. ప్రస్తుతం దేశంలో 5.5 లక్షలకు పైగా 5జీ బేస్ స్టేషన్లు పనిచేస్తున్నాయి. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం 10 రెట్లు పెరిగింది" అని ప్రధాని వివరించారు. ఒక దశాబ్దం క్రితం దేశంలో 'డిజిటల్ విభజన' ఒక పెద్ద సవాలుగా ఉండేదని, కొత్త సాంకేతికత కొందరికే దక్కేదని మోదీ గుర్తుచేశారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించామని, మొబైల్ ఫోన్‌ను కేంద్రంగా చేసుకుని డిజిటల్ సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చామని వివరించారు. భారతీయులకు టెలికాం అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదని, అంతకు మించి అని ఆయన అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారత డిజిటల్ వ్యవస్థ ప్రాముఖ్యతను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో కార్యకలాపాలు స్తంభించిపోయినప్పుడు కూడా, మన దేశంలో కార్యాలయాలు, బ్యాంకులు, విద్యా సంస్థలు డిజిటల్ మౌలిక సదుపాయాల వల్లే నిరంతరాయంగా పనిచేయగలిగాయని గుర్తుచేశారు. ఈ ఏడాది ఐఎంసీ థీమ్ 'సరిహద్దులు లేని విస్తరణ' అని, ఇది భారత టెలికాం, డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుందని మోదీ అన్నారు. అక్టోబర్ 7 నుంచి 10 వరకు జరగనున్న ఈ సదస్సును టెలికమ్యూనికేషన్స్ విభాగం, సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన దేశ, విదేశీ టెలికాం ఆపరేటర్లు, పరిశ్రమల అధిపతులు, నిపుణులు, స్టార్టప్ ప్రతినిధులకు ప్రధాని స్వాగతం పలికారు.

## రైతులకు బేడీలా?
# కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం

హైదరాబాద్: పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' ఖాతా వేదికగా స్పందించారు. "కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది" అని హరీశ్ రావు విమర్శించారు. వారి చేతగానితనం వల్ల పంటలకు నీరందకపోతే, కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అని ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు. "ఇది ప్రజా పాలన కాదు. ప్రజా పీడన. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?" అని హరీశ్ రావు నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## తెలంగాణలో మండుతున్న ఎండలు..
# పలుచోట్ల 37 డిగ్రీల ఉష్ణోగ్రత

హైదరాబాద్: తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పగటిపూట ఎండ ప్రతాపం, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు కాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించిది. రుతుపవనాల నిష్క్రమణ ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఇవి పూర్తిగా నిష్క్రమిస్తాయని అధికారులు వివరించారు. దీని ప్రభావంతో రానున్న కొద్దిరోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# అమరజీవి జలధారకు నిధులు ఇవ్వాలి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాసేపటి క్రితం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని కీలక జల ప్రాజెక్టుల పురోగతిని, నిధుల అవసరాన్ని ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ముఖ్యంగా పోలవరం, జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన అంశాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో రూ.30,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 'జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధార' పథకం వివరాలను చంద్రబాబు కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్రంలోని 95 లక్షల గ్రామీణ కుటుంబాలకు గాను ఇప్పటికే 62 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, ఈ కొత్త పథకం ద్వారా మరో 27 లక్షల కుటుంబాలకు నీటి కనెక్షన్లు అందించడమే లక్ష్యమని వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు నిధులను సకాలంలో విడుదల చేయాలని కోరారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు పురోగతిపై కూడా ఇరువురు నేతలు సమీక్షించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో పనులు వేగంగా సాగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా కేంద్రం పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, దక్షిణాది రాష్ట్రాల్లోని ఐదు నదుల అనుసంధానం అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం. రెండు రోజుల పర్యటన నిమిత్తం చంద్రబాబు ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు.

## బాలీవుడ్‌లో విషాదం..
# ప్రముఖ నటుడు నానా పటేకర్ కన్నుమూత

హైదరాబాద్: భారతీయ సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విలక్షణ నటనకు చిరునామాగా నిలిచిన ప్రముఖ నటుడు నానా పటేకర్ (75) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. గోవాలోని తన నివాసంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 5:20 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు ఆసుపత్రి వర్గాలు ధ్రువీకరించాయి. ఆసుపత్రికి తీసుకొచ్చిన తర్వాత దాదాపు 45 నిమిషాల పాటు వైద్యులు ఆయనను బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, అయినప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన మరణవార్తతో చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. 1978లో 'గమన్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నానా పటేకర్, తన విలక్షణమైన నటన, డైలాగ్ డెలివరీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'పరిందా', 'అబ్ తక్ ఛప్పన్', 'యశ్వంత్', 'వజూద్' వంటి చిత్రాలతో ఆయన నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా 2000 తర్వాత 'శక్తి: ది పవర్', 'అపహరణ్', 'టాక్సీ నెం 9211' వంటి సినిమాల్లో ఆయన నటన విమర్శకుల మన్ననలు పొందింది. ఒకవైపు సీరియస్ పాత్రలతో అలరిస్తూనే, మరోవైపు కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. 'వెల్కమ్' (2007), 'వెల్కమ్ బ్యాక్' (2015) చిత్రాలలో ఆయన పోషించిన 'ఉదయ్ శెట్టి' పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 'రాజ్‌నీతి' చిత్రంలో ఆయన నటనకు ఫిలింఫేర్ అవార్డుకు నామినేట్ అయ్యారు. తన అద్భుత నట ప్రస్థానంలో మూడు జాతీయ అవార్డులను అందుకున్నారు. 2016లో మరాఠీ చిత్రం 'నటసామ్రాట్'లో ప్రదర్శించిన అసమాన నటనకు గాను ఆయన ఫిలింఫేర్ ఉత్తమ నటుడి పురస్కారాన్ని గెలుచుకున్నారు. నటుడిగానే కాకుండా 'యశ్వంత్', 'వజూద్', 'ఆంచ్' వంటి చిత్రాల్లో నేపథ్య గాయకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. నానా పటేకర్ మృతితో భారతీయ సినిమా ఓ గొప్ప నటుడిని కోల్పోయిందని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## స్థానిక ఎన్నికల్లో వైసీపీని అడ్డుకునేందుకు
# కుట్ర జరుగుతోంది: అంబటి రాంబాబు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను నామినేషన్ దశలోనే అడ్డుకునేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అధికారులు ఉద్దేశపూర్వకంగా జారీ చేయడం లేదని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతోనే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారని అంబటి ఆరోపించారు. తహసీల్దార్లకు ఫోన్ చేసి ధ్రువపత్రాలు ఇవ్వొద్దని చెప్పే స్థాయికి చంద్రబాబు, లోకేశ్ దిగజారారని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంపై గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని, వెంటనే సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. సర్టిఫికెట్లు అందకపోవడం వల్ల నామినేషన్లు తిరస్కరణకు గురైతే ప్రజా ఉద్యమం చేపడతామని అంబటి హెచ్చరించారు. ఇదే సమయంలో, తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయం అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. గతంలో తమ ప్రభుత్వం పార్టీ కార్యాలయం కోసం రెండెకరాల భూమిని కేటాయించిందని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ స్థలాన్ని శ్మశానవాటిక కోసం స్వాధీనం చేసుకుంటున్నట్లు తహసీల్దార్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు నివాసానికి అనుమతులు లేవని ఆరోపణలు ఉన్నా, ఆయన కోర్టును ఆశ్రయించి కూల్చివేతను అడ్డుకున్నారని విమర్శించారు. ఈ అంశంపైనా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, నిజాయతీగా ఎన్నికలు జరిగితే కూటమి ఘోరంగా ఓడిపోవడం ఖాయమని అంబటి రాంబాబు జోస్యం చెప్పారు. ప్రభుత్వ చర్యలతో ప్రజలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారు

ఢిల్లీ: ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ.. దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు నిరసనకు దిగారు. ఆందోళనల్లో భాగంగా తొలుత విపక్ష ఎంపీలంతా కలిసి రాజ్‌ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. "300 మంది ఎంపీలం ప్రశాంతంగా ఆందోళన చేయాలనుకుంటున్నాం. జంతర్‌మంతర్ వెళ్లాలని ప్రయత్నించాం. కానీ మమ్మల్ని అనుమతించలేదు. మొదటి రోజు మమ్మల్ని ఎన్నికల సంఘం వద్దకు వెళ్లకుండా ఆపారు. ఆ తర్వాత నిన్న జంతర్ మంతర్‌కు వెళ్లి నిరసన తెలియజేస్తామని అడిగితే.. మమ్మల్ని ఆపేశారు. మా వాళ్లను కొట్టారు. వాళ్లకు శిక్ష పడుతుంది. ఇది మా హామీ. మోదీ, అమిత్‌షా, మోహన్ భాగవత్, జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. ఆ నలుగురికి శిక్ష పడటం మీరే చూస్తారు" అని రాహుల్ మాట్లాడారు.

నిరసనల వేళ.. జ్ఞానేశ్ కుమార్ నియామకంపై సుప్రీంలో పిటిషన్

ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు.

## సీఎం అయ్యాక నన్ను స్టింగ్ ఆపరేషన్‌తో
# ఇరికించే ప్రయత్నం..
## డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు

కర్ణాటక: కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంచలన ఆరోపణలు చేశారు. తాను సీఎం అయిన తర్వాత తనను స్టింగ్ ఆపరేషన్‌లో ఇరికించేందుకు ప్రయత్నం జరిగిందని చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలు, పత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారో తనకు తెలుసని అన్నారు. ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడిన శివకుమార్.. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత కొందరు వ్యక్తులు తనను కలిశారని చెప్పారు. వారెవరో, ఎవరి కోసం వచ్చారో తనకు తెలుసన్నారు. "నన్ను ఇరికించేందుకు ప్రయత్నం చేశారు. నా వద్ద ఫొటోలు ఉన్నాయి. ఈ స్టింగ్ ఆపరేషన్ల వెనుక ఉన్న వ్యక్తి ఎవరో నాకు తెలుసు" అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు శివకుమార్ వెల్లడించారు. తనను కలిసిన వ్యక్తులకు సంబంధించిన పత్రాలను భద్రపరిచినట్లు చెప్పారు. అయితే ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడు బయటపెట్టలేనన్నారు. "వాళ్లు ఏం మాట్లాడేందుకు వచ్చారు? ఎలా వచ్చారు? ఎవరిని కలిశారు? అన్నీ నాకు తెలుసు. దీని వెనుక ఎవరు ఉన్నారో కూడా తెలుసు" అని శివకుమార్ అన్నారు. ప్రభుత్వ అధికారులను కూడా ఇలాంటి ఉచ్చుల్లోకి లాగవచ్చని హెచ్చరించిన ఆయన.. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. తన చుట్టూ మూడు స్థాయిల్లో వ్యక్తులు ఉంటారని, కొందరిని ప్రత్యేకంగా నియమించినట్లు తనకు సమాచారం ఉందని ఆరోపించారు. తనపైనే కాకుండా మరికొందరిపైనా స్టింగ్ ఆపరేషన్లు జరుగుతున్నాయని శివకుమార్ ఆరోపించారు. వాటి వెనుక ఎవరు ఉన్నారు? వాటికి నిధులు ఎవరు సమకూరుస్తున్నారు? అన్న సమాచారం తన వద్ద ఉందని చెప్పారు. తన ఆరోపణలకు ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మంత్రులను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్లు జరిగే అవకాశం ఉందని ఇటీవల కేబినెట్ సమావేశంలో శివకుమార్ హెచ్చరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శివకుమార్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి హెచ్.డీ. కుమారస్వామి ప్రశ్నలు లేవనెత్తారు. కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర కూడా కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. స్టింగ్ ఆపరేషన్లు నిర్వహించి వాటితో వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేయడం కాంగ్రెస్‌కు గతంలోనూ అలవాటేనని ఆరోపించారు. బీజేపీ నేత ఆర్. అశోక్ కూడా శివకుమార్ గతంలో ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్నందుకే ఇప్పుడు ఆందోళన చెందుతున్నారని విమర్శించారు.

# రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రానికి నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయవద్దు

హైదరాబాద్: బొగ్గు సరఫరా లేకుండా యాదాద్రి థర్మల్ ప్లాంటు ఎలా నిర్మిస్తారని, గత భారాస ప్రభుత్వం చేసిన తప్పిదాలతోనే యాదాద్రి ప్లాంటు నిర్మాణం ఆలస్యమైందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని సరిచేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి ఇక నుంచి వారానికి ఒకసారి డాక్యుమెంటరీ ఆధారాలతో సమాధానం ఇస్తామని భట్టి ప్రకటించారు. బుధవారం విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, సింగరేణి, విద్యుత్ సంస్థల సీఎండీలు బుద్ధప్రకాష్, కృష్ణభాస్కర్, ముషారఫ్, హరీష్, జితేష్ వి.పాటిల్‌లతో కలసి మీడియాతో మాట్లాడారు. "పది సంవత్సరాలు అధికారంలో ఉండి ఏం చేశారో చెప్పకుండా ప్రతిపక్షంలో ఉన్నారని భారాస నేత హరీశ్‌రావు ఏదిపడితే అది మాట్లాడటం సరికాదు. రాజకీయ విమర్శల కోసం విద్యుత్ సంస్థలు, సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలపై ప్రజల్లో అపోహలు సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు మంచిది కాదు. రాజకీయ లబ్ధి కోసం రాష్ట్రానికి నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయవద్దని హరీశ్‌రావుకు చెబుతున్నా. విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిన పరిస్థితుల్లోనూ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్న జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల అధికారులు, సిబ్బందిని ప్రశంసించాల్సింది పోయి కొందరు నాయకులు తప్పుడు సమాచారంతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు. డిస్కంలు, ట్రాన్స్‌కో, జెన్‌కోలను ప్రైవేటీకరించబోతున్నామని, లిస్టెడ్ కంపెనీలుగా మార్చబోతున్నామని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాలనే నెహ్రూ విధానం మాది.

బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనకుండా నాడు పక్కన పెట్టారు

యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు లింకేజీపై గత పాలకులకు ముందుచూపు లేదు. జీ9 గ్రేడ్ రకం బొగ్గు అందుబాటులో లేకపోయినా 2018లో 7 మిలియన్ టన్నులు సింగరేణి నుంచి కేటాయిస్తామని, మరో 7 మిలియన్ టన్నులు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటామని తెలిపారు. 2022 ఏప్రిల్‌లో ఆ ఒప్పందాన్ని రద్దు చేసి సింగరేణి నుంచే మొత్తం 14 మిలియన్ టన్నులూ సరఫరా చేస్తామని చెప్పారు. అయితే 2022-23 ఆర్థిక సంవత్సరంలో సిగరేణిలో జీ9 గ్రేడ్ రకం బొగ్గు ఉత్పత్తి కేవలం 1.71 మిలియన్ టన్నులే. అప్పటికే ఉన్న పాత ప్లాంట్లకే అది సరిపోలేదు. మరి 14 మిలియన్ టన్నులు సింగరేణి నుంచి ఇస్తామని ఎలా ఒప్పందం చేశారు? ఇది వాస్తవమా.. కాదా చెప్పాలని హరీశ్‌రావుకు సవాల్ విసురుతున్నా. యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి వ్యయం యూనిట్‌కు రూ.6.66 అవుతుంది. ఈ ధర ఎక్కువగా ఉండటంతో తెలంగాణ ప్రజలపైనే ఆర్థికభారం భారం పడుతుంది. ఈ పాపం భారాస పాలకులదే" అని భట్టి విమర్శించారు. ట్రూఅప్ ఛార్జీలపై హరీశ్‌రావు విమర్శలను విలేకరులు ప్రస్తావించగా భట్టి.. దక్షిణ డిస్కం జితేష్‌ను వివరించాలని మైక్ ఇచ్చారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ఈఆర్సీ నిర్ణయం తీసుకుందని జితేష్ తెలిపారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
వై ఎస్ ఆర్ కడప జిల్లా
శుక్రవారం - 09 - అక్టోబర్ - 2026

# పేరుకే కాలనీలు -అభివృద్ధిలో శూన్యం




రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 08 : రాయచోటిలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్ సంబేపల్లి మండలం క్లస్టర్ ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ" పేరుకే కాలనీలు -అభివృద్ధిలో శూన్యమని" విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం కనీసం గుంతలను కూడా పూడ్చ కుండా, కనీస రహదారి సౌకర్యం కూడా లేకుండా, నీటి సౌకర్యాలు లేకుండా లేఔట్లను వేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. కానీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గుడి, బడి, వైద్యం, విద్య, త్రాగునీటి విషయాలలో రాజకీయాలకు తావు లేకుండా, అభివృద్ధి విషయంలో ప్రజలందరికీ సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో తిరుపతి నాయుడు కాలనీ, ఇందిరమ్మ కాలనీ, రాయుడు కాలనీ, ఎన్జీవో కాలనీ, లక్ష్మీపురం కాలనీలలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఇప్పుడు రాంప్రసాద్ రెడ్డి కాలనీలలో సిమెంటు రోడ్డులను, డ్రైనేజీలను వేయిస్తూ కాలనీల అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు బుద్ధి తెచ్చుకొని ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు.

## మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపులో పారదర్శకత..!

### లక్కీ డ్రా ద్వారా 27 దుకాణాలకు లైసెన్సుల కేటాయింపు



కడప, మహి న్యూస్ అక్టోబర్ 8: మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపు ప్రక్రియను నిబంధనల మేరకు పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా పేర్కొన్నారు. 2026--27 ఎక్సైజ్ పాలసీ కింద ఏ4 మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపులో భాగంగా గురువారం కడప కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో జేసీ డా. నిధిమీనా సమక్షంలో లక్కీ డ్రా (డ్రాఫ్ లాట్స్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నోటిఫై చేసిన మొత్తం 60 మద్యం దుకాణాలకు లైసెన్సుల కేటాయింపు కోసం చేపట్టిన ప్రక్రియలో భాగంగా, గురువారం నిర్వహించిన లక్కీ డ్రా ద్వారా 27 దుకాణాలకు లైసెన్సుల కేటాయింపు విజయవంతంగా పూర్తయిందని జేసీ తెలిపారు. నిబంధనల ప్రకారం, అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ ప్రక్రియను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రమేష్, సంబంధిత శాఖాధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు...!

### రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మహి న్యూస్ అక్టోబర్ 8: స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని రకాల ఏర్పాట్లను, సన్నద్ధతలను పకడ్బందీగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లపై ఇప్పటికే దృష్టి



సారించినట్లు ఆయన పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ గురువారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఆయా శాఖల జిల్లా అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కడప కలెక్టరేట్‌లోని బోర్డు సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఎన్నికల ఏర్పాట్లు, అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది సమీకరణ, ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న చర్యలపై అనీల్ చంద్ర పునేఠ సమీక్షించారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను దశలవారీగా సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన అదనపు



సిబ్బందిని కూడా సమకూర్చుకోవాల్సి ఉందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో మల్లికార్జునుడు, ఆర్డీవో మురళీ, జడ్పీ సీఈఓ సుబ్రహ్మణ్యం, డీపీఓ రామచంద్ర, నగర పాలక సంస్థ కమిషనర్ భవానీప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## టీబీ నిర్మూలనకు సమష్టి కృషి చేయాలి

### ప్రజల్లో అవగాహన కల్పించిన జోష్ బృందం




కడప, మహి న్యూస్, అక్టోబర్ 8: టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా టీబీ రహిత కడప కోసం జోష్ బృందం ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ విద్యార్థి దళం (ఎన్‌సీసీ) క్యాడెట్లు, మై భారత్ స్వచ్ఛంద సేవకులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. టీబీ లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స, మందులను క్రమం తప్పకుండా వినియోగించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ బాధితులకు పోషకాహారం అందించడంతో పాటు, వారికి కుటుంబ సభ్యులు, సమాజం నుంచి సహకారం అందించాలని కార్యక్రమంలో సూచించారు. టీబీ నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములై కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, జాతీయ విద్యార్థి దళం క్యాడెట్లు, మై భారత్ స్వచ్ఛంద సేవకులు, జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షణకు హెచ్‌పీవీ టీకా

### 24,769 మంది బాలికలకు టీకా అందించి 104 శాతం లక్ష్యం సాధింపు




కడప, మహి న్యూస్, అక్టోబర్ 8: గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా ఎంతో కీలకమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. యుగంధర్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 14 సంవత్సరాల వయస్సు కలిగిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం అందిస్తున్న హెచ్‌పీవీ టీకాలను జిల్లాలో 24,769 మంది బాలికలకు అందించి 104 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. అలాగే యువిన్ యాప్‌లో అన్ని మోతాదుల వివరాలను 100 శాతం నమోదు చేసి రాష్ట్రంలో వైఎస్ఆర్ కడప జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. హెచ్‌పీవీ టీకా లబ్ధిదారులకు టీకాలు అందించడంలో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి డాక్టర్ యుగంధర్ అభినందనలు తెలిపారు. ఇదే విధమైన సహకారం, పురోగతిని ఇతర కార్యక్రమాల్లోనూ కొనసాగించి, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో రాష్ట్రంలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# వరకట్న నిర్మూలన, లింగ సమానత్వంపై విద్యార్థినులకు అవగాహన

కడప, అక్టోబర్ 8 (మహి న్యూస్): వరకట్న దురాచారాన్ని నిర్మూలించడంతో పాటు లింగ సమానత్వం, రాజ్యాంగ విలువలు, మహిళల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. శాంత పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప ఆధ్వర్యంలో, మహిళా శిశు సంక్షేమ శాఖ సహకారంతో కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు, అవగాహన కార్యక్రమంతో పాటు



ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. శాంత మాట్లాడుతూ




వరకట్నం తీసుకోవడం, ఇవ్వడం వల్ల కలిగే సామాజిక, చట్టపరమైన సమస్యలను విద్యార్థినులకు వివరించారు. వరకట్న దురాచార నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు, పురుషులకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడమే లింగ సమానత్వమని తెలిపారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవం, స్వేచ్ఛ వంటి హక్కులను కల్పించిందని వివరించారు. మహిళలకు చట్టపరంగా కల్పించిన హక్కులు, రక్షణలతో పాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం, న్యాయ అవగాహన కార్యక్రమాలు, లోక్ అదాలత్‌లు తదితర సేవలను వివరించారు. న్యాయ సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను పరస్పర అంగీకారంతో, స్నేహపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, బలహీన వర్గాలకు




అందుబాటులో ఉన్న న్యాయ సహాయ సేవలపై అవగాహన కల్పించారు. న్యాయ సేవల కోసం 15100 హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. వరకట్నం లేని వివాహాలు, లింగ వివక్ష లేని సమాజం, మహిళలకు గౌరవం, సమాన అవకాశాలు కల్పించే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు కుటుంబాలు, సమాజంలోనూ న్యాయ అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ పి. రామదేవి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రవి తేజ, శ్రీ మనోహర్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. స్మిత, వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ ఎన్. అశ్విని, మహిళా సాధికారత సెల్ కన్వీనర్ డా. పి.ఎం.ఆర్. జయంతి, తెలుగు విభాగాధిపతి బి. శివమ్మ, ఇంగ్లీష్ విభాగాధిపతి పి. సుజాత, డా. బి. స్వరూప, కోర్టు సిబ్బంది, అధ్యాపకులు, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాపై ప్రత్యేక పునఃపరిశీలనకు ప్రత్యేక కార్యక్రమం..!

### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చడమే లక్ష్యం

### అనర్హుల పేర్ల తొలగింపుతో పాటు పొరపాటున తొలగిన అర్హుల పేర్ల పునఃచేర్పునకు అవకాశం

కడప, మహి న్యూస్ అక్టోబర్ 8 : అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు జాబితాలో లేకుండా చూడాలనే ఎన్నికల సంఘం లక్ష్యానికి అనుగుణంగా ప్రత్యేక పునఃపరిశీలన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా జూన్ 15 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించినట్లు తెలిపారు.



మరణం, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడం, బహుళ నమోదులు, ఆచూకీ లభించకపోవడం తదితర కారణాలతో రాష్ట్రవ్యాప్తంగా 44,89,512 మంది ఓటర్లు తమ చిరునామాల్లో అందుబాటులో లేనట్లు గుర్తించినట్లు వివరించారు. అనంతరం అనర్హుల పేర్లు, మరణించినవారి పేర్లు, మారినవారి పేర్లు, బహుళ నమోదులను తొలగించి జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా అనంతరం నోటీసుల ప్రక్రియలో అక్టోబర్ 6 నాటికి మరో 1,73,071 మంది ఓటర్లు తుది జాబితాలో చేర్చేందుకు అర్హులు కాదని గుర్తించినట్లు తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 46,62,583 పేర్లు తొలగింపు పరిశీలన పరిధిలోకి వచ్చినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో 9,524 మంది అనర్హులుగా గుర్తించగా, గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం, బహుళ నమోదులు (ఏఎస్‌డీడీ) కింద 2,44,919 మంది ఓటర్ల వివరాలు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ వివరాలను బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి మరోసారి పరిశీలించి, సంబంధిత ఓటర్ల వివరాలను ధ్రువీకరించనున్నట్లు చెప్పారు. పొరపాటున అర్హుడైన ఓటరు పేరు తొలగిపోయినట్లు గుర్తిస్తే, సంబంధిత వ్యక్తితో ఫారం--6 దరఖాస్తు చేయించి, తగిన ధ్రువీకరణ అనంతరం నిరంతర నవీకరణ ప్రక్రియలో ఓటర్ల జాబితాలో పేరు చేర్చేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి మిగిలిపోకుండా చూడటమే ప్రత్యేక కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా రాష్ట్ర తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 16న ప్రచురించనున్నట్లు తెలిపారు. తుది జాబితాలో పేరు లేకపోయిన అర్హులైన వారు, తదుపరి అర్హత తేదీల నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసి అర్హత పొందిన వారు నిరంతర నవీకరణలో భాగంగా ఫారం--6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

# అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవాలను విశ్వ వ్యాప్తం చేయాలి..!

### డిఆర్వో కె. మల్లికార్జునుడు అధ్యక్షతన ఉరుసు మహోత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం

### ఈనెల 25, 26వ తేదీల్లో కన్నుల పండుగగా గంధం, ఉరుసు మహోత్సవాలు

కడప, అక్టోబర్ 8 : కడప ఖ్యాతిని విశ్వ వ్యాపితం చేసేలా.. అమీన్ పీర్ దర్గా మహోత్సవాలను భక్తి భావం, పర్యాటక వైభవాన్ని ప్రతిబింభించేలా.. అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో చేపట్టాలని.. డిఆర్వో కె. మల్లికార్జునుడు.. దర్గా ఉత్సవ కమిటీ సభ్యులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ లో.. అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై.. డిఆర్వో కె. మల్లికార్జునుడు అధ్యక్షతన ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిలుగా డిఆర్వో తోపాటు...





ఏఎస్పీ ప్రకాశ్ బాబు, కడప ఆర్డీవో మురళి, నగర కమీషనర్ భవానీ ప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి హిదాయతుల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. సాధ్యాత్మికం, పర్యాటక వనరులు కలబోసిన వైఎస్ఆర్ కడప జిల్లా ఖ్యాతిని దేశ విదేశాల్లో ప్రతిబింభించేలా గతంలో కంటే ఈ ఏడాది ఉరుసు ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రెవెన్యూ, సంబందిత శాఖల సమన్వయంతో అన్ని రకాల ఏర్పాట్లను పూర్తిచేసి.. ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అలాగే పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని, ఎక్కడా ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా గట్టి భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉరుసు మహోత్సవాల్లో భాగంగా.. ఇప్పటికే ఈ నెల 12వ తేదీ "జేలా" కార్యక్రమంతో.. ఉరుసు ఉత్సవాలకు నాంది పలకడం జరుగుతుందన్నారు. ఉరుసు మహోత్సవాల సందర్భంగా.. ముఖ్యమైన 5 రోజుల పాటు రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, దర్గా.. వరకు నగరంలోని అన్ని రూట్లను కవర్ చేస్తూ.. నిరంతరాయంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఉత్సవాల్లో భాగంగా దర్గా, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ దీపాలంకరణలో ఎక్కడా కూడా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా నిరంతర పర్యవేక్షణ జరగాలన్నారు. వీఐపీలు, ప్రోటోకాల్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కడప నగరంలో జరిగే అతిపెద్ద మహోత్సవాన్ని ప్రపంచం వీక్షించేలా.. సమాచార పౌర సంబంధాల శాఖ, మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత ఏర్పాట్లను చూడాలన్నారు. పారిశుధ్యం, రోడ్లు, విద్యుత్, మంచినీరు వసతులకు ఎలాంటి కొరత లేకుండా.. ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అధిక సంఖ్యలో వైద్య సిబ్బందిని వైద్యాధికారులను నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే 108, అంబులెన్స్ తదితర వాహనాలతో పాటు అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం శాఖల వారీగా చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఏఎస్పీ ప్రకాష్ బాబు మాట్లాడుతూ.. ఉరుసు మహోత్సవాల్లో ఈ నెల 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు కన్నుల పండుగగా జరుగనుందని.. ప్రధానంగా 25, 25వ తేదీల్లో జరిగే గంధం, ఉరుసు ఉత్సవ ఘట్టాలకు లక్షలాది మంది భక్తులు, విఐపిలు హాజరవుతారన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఉరుసు మహోత్సవాన్ని జరిపించడంలో పోలీసు శాఖ అన్ని రకాల భద్రత చర్యలను చేపట్టిందన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. రూట్ మ్యాపింగ్ చేసి సిబ్బందికి డ్యూటీలు కేటాయిస్తున్నామన్నారు.

#### ఉరుసు మహోత్సవాల్లో ప్రధాన కార్యక్రమాలు

24-10-2026వ తేది మొదటి రోజు ఉదయం 10 గంటలకు సర్ గిరోలు, షఖీర్లు, ఊరేగింపుతో దర్గా షరీఫ్ షరీఫ్ నకు వచ్చి చదివింపులు ఇచ్చి వారి స్తానంలో బిస్తర్ చేయుదురు. 25-10-2026వ తేదీ రెండవ రోజు గంధం కార్యక్రమంలో భాగంగా ఉదయం.. దర్గా నుండి బాదుల్లా సాహెబ్ మకాన్ వరకుపకీర్ల ఊరేగింపు సాంగ్యం, సాయంత్రం పీఠాధిపతులు దివ్యాసనం, ధ్యాన తపస్సు. రాత్రి గంధం ఊరేగింపు, ఫేతెహ సమర్పణ, ఖవాలీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. 26-10-2026 వ తేదీ మూడవ రోజు.. ఇదార-యే-అమీనియా చిస్తీయా వార్షిక నివేదిక.



రాత్రి ఉరుసు మహోత్సవం, ఎద్దుకబండ్ల చౌహరీ ఖలీఫల చాందినీ, గంధం ఊరేగింపు, చదివింపులు, ఖవాలీ మొదలైన పవిత్ర పుణ్య కార్యక్రమాలు జరుగుతాయి. 27-10-2026 వ తేదీ నాల్గవ రోజు.. తహలీల్ ఫతేహ ఉత్సవంలో భాగంగా.. ప్రసాద సమర్పణ, సంబందిత హోలీ ప్రార్ధనలు, రాత్రి ప్రముఖ విద్వాంసులతో 82వ ఉర్దూ కవి సమ్మేళనం (ముషాయిరా) జరుగుతుంది. 28-10-2026 వ తేదీ ఐదవ రోజు.. రాత్రి 10గంటల నుండి తెల్లవారి 3 గంటల వరకు సమాఖానీ సజ్జదనషీన్ పీఠాధిపతి వారి ఆధ్వర్యంలో ఖవాలీ, ఖురాన్ పఠనం, తదితర కార్యక్రమాలు. 29-10-2026 వ తేదీ ఆరవ రోజు.. ఫకీర్లతో పీఠాధిపతులు వారి వాటర్ గండిలోని హాజరత్ మస్తాన్ స్వామివారి దర్శనం, జెండా ప్రతిష్ట, చదివింపులు. ఈ కార్యక్రమంలో... అమీన్ పీర్ దర్గా మేనేజర్ మహ్మద్ అలీఖాన్, డిఎంహెచ్ఓ, ఫైర్, ఆర్టీసీ మైనారిటీ, ఈడపీఆర్, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు, సంబందిత శాఖల జిల్లా అధికారులు, దర్గా మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 8: యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్‌తో పాటు భోజన, వసతి సౌకర్యాలు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధికారిత అధికారి శ్రీమతి పి. తేజస్విని తెలిపారు. అర్హులైన అన్నమయ్య జిల్లా అభ్యర్థులు ఈ నెల 20.10.2026లోగా జిల్లా బీసీ సంక్షేమ అధికారి కార్యాలయం, బి.టి. పీజీ కాంపౌండ్, రూమ్ నం.143, మదనపల్లెలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 27.10.2026న రాష్ట్రవ్యాప్తంగా నిర్ణయించిన కేంద్రాల్లో సివిల్ సర్వీసెస్ సిలబస్ ఆధారంగా స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధికారిత అధికారి తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షలో మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి, విజయవాడ గొల్లపూడి లోని బీసీ స్టడీ సర్కిల్ ద్వారా 16.11.2026 నుంచి ఉచిత శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు 10వ తరగతి, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల ధృవీకరణ పత్రం, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1 లక్షలోపు ఉన్నట్లు తెలిపే తాజా ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు జతచేసి దరఖాస్తు సమర్పించాలి.మరిన్ని వివరాలకు 7989819470 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధికారిత అధికారి పి. తేజస్విని కోరారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
కర్నూలు - నంద్యాల
శుక్రవారం - 09 - అక్టోబర్ - 2026

## ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలిసిన పత్తికొండ నూతన డీఎస్పీ



### బాధ్యతలు స్వీకరించిన వంశీధర్ గౌడ్
### శాంతిభద్రతలు, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచన

కర్నూలు, అక్టోబర్ 8: (మహి న్యూస్): పత్తికొండ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వంశీధర్ గౌడ్ గురువారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పత్తికొండ సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేలా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.

## రోడ్డుపై గుంతలు తవ్విన వారిపై కేసు నమోదు

### షామియానాల కోసం రోడ్లను తవ్వడంపై చర్యలు
### మున్సిపల్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం: కమిషనర్ ఓబులేసు



కర్నూలు, అక్టోబర్ 8: (మహి న్యూస్): ప్రజాధనంతో నిర్మించిన రహదారులపై గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం వంటి పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ చట్టం--1994లోని సెక్షన్ 197 ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలోని గణేష్ నగర్--2లో షామియానాల ఏర్పాటు కోసం రహదారిపై గుంతలు తవ్విన విషయం గురువారం కమిషనర్ దృష్టికి రావడంతో ఇంజినీరింగ్ విభాగం అధికారులను మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు, పూజా కార్యక్రమాలు, జన్మదిన వేడుకలు, ఇతర శుభకార్యాల కోసం షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేసేటప్పుడు రహదారులపై గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం చేయరాదని కమిషనర్ సూచించారు. రోడ్డును తవ్వడం వల్ల ప్యాచ్‌లు ఏర్పడి రహదారి నాణ్యత దెబ్బతింటుందని, భవిష్యత్తులో అదే ప్రాంతంలో గుంతలు మరింత పెద్దవిగా మారి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. పదేపదే రహదారులకు మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన రహదారులను కాపాడేందుకు షామియానాలు, పందిళ్ల ఏర్పాటు కోసం కాంక్రీట్ స్టాండ్లను మాత్రమే ఉపయోగించాలని ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు, కార్యక్రమ నిర్వాహకులకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## 2030 నాటికి టీబీ రహిత భారత్ లక్ష్యం

### ప్రజల భాగస్వామ్యంతోనే టీబీ రహిత సమాజం
### జిల్లాలో 1,200 మంది టీబీ బాధితులకు పోషకాహార కిట్లు
### 455 మంది పేద టీబీ బాధితులను దత్తత తీసుకున్న గ్రీన్ కో సంస్థ



కర్నూలు, అక్టోబర్ 8: (మహి న్యూస్): 2030 నాటికి టీబీ రహిత భారతదేశాన్ని సాధించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. టీబీ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పీ. నడ్డా వర్చువల్‌గా ప్రారంభించిన జాష్ (జాయింట్ స్వాడ్ ఫర్ హెల్త్) కార్యక్రమాన్ని గురువారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీక్షించారు. అనంతరం టీబీ బాధితులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా పూర్తిగా కొనసాగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. టీబీ నిర్మూలనలో యువతను భాగస్వాములను చేయాలని, బ్లాక్ స్థాయిలో ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్





వాలంటీర్లు చురుగ్గా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. చికిత్స పొందుతున్న టీబీ బాధితుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పోషకాహార కిట్లను అందిస్తున్నామని, ఇప్పటివరకు జిల్లాలో సుమారు 1,200 మంది బాధితులకు కిట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గ్రీన్ కో సంస్థ కర్నూలు జిల్లాలో 455 మంది పేద టీబీ బాధితులను దత్తత తీసుకుని వారికి సహాయ సహకారాలు అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా ఐదుగురు టీబీ బాధితులకు పోషకాహార కిట్లను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా. కామేశ్వర ప్రసాద్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డా. భాస్కర్, జిల్లా యువజన అధికారి ఐజయ్య, పల్మనాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. వేణుగోపాల్ రెడ్డి, డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డా. మల్లికార్జున రెడ్డి, ఎన్‌సీసీ నోడల్ అధికారులు, క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక ఘాట్‌కు మునుపటి శోభ తీసుకొద్దాం

### కేసి కెనాల్‌లో చెత్తాచెదారం వేయొద్దు
### ఘాట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
### నగర ప్రజలకు కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి



కర్నూలు, అక్టోబర్ 8: (మహి న్యూస్): కర్నూలు నగరంలోని వినాయక ఘాట్‌ను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది మునుపటి శోభను తీసుకురావాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సిబ్బందిని ఆదేశించారు. గురువారం వినాయక ఘాట్‌ను పరిశీలించిన కమిషనర్ పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, ఇతర అవశేషాలను పూర్తిగా తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఘాట్‌కు వచ్చే ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం అందేలా ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి ఆదేశించారు. వినాయక ఘాట్ ఆధ్యాత్మిక, పవిత్ర ప్రదేశమని, దాని పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కమిషనర్ తెలిపారు. కేసి కెనాల్‌లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. నీటి ప్రవాహం లేని సమయంలో కేసి కెనాల్‌లో చెత్త వేయడం వల్ల గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు గమనించారని, వాటిని దృష్టిలో ఉంచుకుని ఘాట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నగర ప్రజలు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



# రూ.1.20 కోట్ల విలువైన 589 మొబైల్ ఫోన్లు రికవరీ

### ఆరు విడతల్లో 3,670 ఫోన్ల రికవరీ
### మొత్తం విలువ రూ.7.36 కోట్లు
### తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్ నుంచి ఫోన్లను రికవరీ చేసిన పోలీసులు
### మొబైల్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్‌లో ఐఎంఈఐ వివరాలు నమోదు చేసుకోవాలి: ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు, అక్టోబర్ 8: (మహి న్యూస్): కర్నూలు జిల్లా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న




మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో గురువారం




నిర్వహించిన ఆరో మొబైల్ రికవరీ మేళాలో 589 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ బాధితులకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.1.20 కోట్లు. ఇప్పటివరకు నిర్వహించిన ఆరు విడతల మొబైల్ రికవరీ కార్యక్రమాల్లో మొత్తం 3,670 మొబైల్ ఫోన్లను రికవరీ చేయగా, వాటి విలువ సుమారు రూ.7.36 కోట్లు ఉంటుందని ఎస్పీ తెలిపారు. కర్నూలు జిల్లా ఐటీ కోర్ టీమ్, సైబర్ ల్యాబ్ పోలీసులు, స్థానిక పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఫోన్లను కూడా గుర్తించి రికవరీ చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి ఫోన్లను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. మొబైల్ ఫోన్‌లో బ్యాంకింగ్ లావాదేవీలు, ఫోన్ నంబర్లు, ఫొటోలు, వీడియోలు, వ్యక్తిగత సమాచారం వంటి కీలక వివరాలు ఉంటాయని ఎస్పీ తెలిపారు. అందువల్ల ఫోన్ పోయినప్పుడు ఆర్థిక నష్టంతో పాటు వ్యక్తిగతంగా కూడా బాధితులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. బాధితులకు ఫోన్లు తిరిగి అందించేందుకు పోలీసులు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని తెలిపారు. కర్నూలులో పోయిన మొబైల్ ఫోన్‌ను హైదరాబాద్‌లో గుర్తించి కర్నూలు రెండో పట్టణ పోలీసులు, పిఠాపురంలో పోయిన ఫోన్‌ను బెంగళూరులో




గుర్తించి ఎమ్మిగనూరు రూరల్ పోలీసులు, తమిళనాడులో పోయిన ఫోన్‌ను అక్కడే గుర్తించి ఉలిందకొండ పోలీసులు రికవరీ చేశారు. అలాగే కర్నూలులో పోయిన మరో ఫోన్‌ను మహారాష్ట్రలో గుర్తించి కర్నూలు తాలూకా పోలీసులు, సి.క్యాంప్‌లో పోయిన ఫోన్‌ను తమిళనాడులో గుర్తించి కర్నూలు మూడో పట్టణ పోలీసులు రికవరీ చేశారు.

### సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయాలి

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గురైనా ప్రజలు ఆందోళన చెందకుండా కేంద్ర ప్రభుత్వం అందించిన సీఈఐఆర్ పోర్టల్‌లో వెంటనే మొబైల్ ఐఎంఈఐ నంబర్, ఇతర వివరాలను నమోదు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. సీఈఐఆర్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగా పోలీసులు ఫోన్‌ను ట్రాక్ చేసి రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఫోన్ పోయిన వెంటనే ఆలస్యం చేయకుండా వివరాలను నమోదు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సీఐలు మధుసూదన్ రావు, శివశంకర్, సైబర్ ల్యాబ్ ఎస్ఐలు వెంకట మోహన్, ఆశాలత, సైబర్ ల్యాబ్ సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

# జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత

### భూగర్భ జలమట్టం పెంపే లక్ష్యంగా 3,714 పనులు పూర్తి
### జిల్లాలో 0.793 టీఎంసీల భూగర్భ జల రీఛార్జ్ సామర్థ్యం
### రెండో దశలో మరో 1,232 పనులు రెండు నెలల్లో పూర్తి
### జల సంరక్షణ పనులతో 38 లక్షల పనిదినాల కల్పన

కర్నూలు, అక్టోబర్ 8: (మహి న్యూస్): కర్నూలు జిల్లాలో భూగర్భ జలమట్టాన్ని పెంచడం, వర్షపు నీటిని సమర్థవంతంగా సంరక్షించడం, నీటి వనరులను పునరుద్ధరించడమే లక్ష్యంగా



'జలధార--జలహారతి' కార్యక్రమం కింద వివిధ జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. దేశవ్యాప్తంగా స్కోచ్ అవార్డ్సుకు నామినేట్ చేసిన కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు జిల్లాలో అమలు చేస్తున్న 'జలధార--జలహారతి' కార్యక్రమం, దాని ద్వారా




సాధించిన ఫలితాలను కలెక్టర్ వివరించారు. జిల్లాలో సుమారు 8 లక్షల హెక్టార్ల భౌగోళిక విస్తీర్ణం ఉండగా, 77 శాతం భూమి సాగులో ఉందని తెలిపారు. ఇందులో సుమారు 4,38,355 హెక్టార్లు వర్షాధార సాగు కింద ఉన్నాయని చెప్పారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను రీఛార్జ్ చేసేలా నీటి సంరక్షణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

### 3,714 పనులు పూర్తి

'జలధార--జలహారతి' మొదటి దశలో 3,714 పనులను పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో 2,511 కిలోమీటర్ల ఫీడర్ ఛానళ్ల పూడికతీత, 377 చెక్‌డ్యామ్‌లు, 179 పెర్కొలేషన్ ట్యాంకుల పూడికతీత, 262 వాటర్ హార్వెస్టింగ్ పండ్ల నిర్మాణం, 18 ప్రాంతాల్లో ట్రెంచ్‌ల తవ్వకం వంటి పనులు ఉన్నాయని వివరించారు. మొత్తం 46.15 లక్షల ఘనపు మీటర్ల మట్టిని తొలగించినట్లు తెలిపారు. రెండో దశలో మరో 1,232 పనులు చేపడుతున్నామని, వీటిని రెండు నెలల్లో పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఫీడర్ ఛానళ్లు, చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పండ్లు, రిటెన్షన్ పిట్స్ తదితర పనులు ఇందులో ఉన్నాయని తెలిపారు. కార్పొరేట్ సంస్థలు, ప్రజాప్రతినిధులు, వాటర్ యూజర్స్ అసోసియేషన్లను భాగస్వాములను చేసి 1,816 గంటల పాటు ఎక్స్‌కవేటర్లను వినియోగించినట్లు కలెక్టర్ తెలిపారు. 29 చెరువుల్లో పూడికతీత, 35 ఫీడర్ ఛానళ్లలో 35.58 కిలోమీటర్ల మేర పనులు చేపట్టి 77,656 ఘనపు మీటర్ల పూడికను తొలగించినట్లు చెప్పారు.

### 0.793 టీఎంసీల రీఛార్జ్ సామర్థ్యం

ఫీడర్ ఛానళ్ల పూడికతీత ద్వారా 0.258 టీఎంసీలు, ట్యాంకుల్లో పూడికతీత ద్వారా 0.153 టీఎంసీల అదనపు రీఛార్జ్ సాధించినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తంగా జిల్లాలో 0.793 టీఎంసీల భూగర్భ జల రీఛార్జ్ సామర్థ్యం ఏర్పడిందన్నారు. రిటెన్షన్ పిట్స్ ద్వారా వాగుల్లో నీటి వేగాన్ని తగ్గించి భూమిలోకి నీరు ఇంకేలా చేస్తున్నట్లు తెలిపారు. డీఎంఎఫ్ నిధులతో రూ.4 కోట్లతో 40 పనులు మంజూరు చేశామని, వాటి ద్వారా సుమారు 761 ఎంసీఎఫ్‌టీ నీటిని నిల్వ చేసి 3,622 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన, వీబీజీ రామ్‌జీ పథకాల కింద రూ.5.88 కోట్ల అంచనా వ్యయంతో 515 పనులను గుర్తించామని, వీటిని కూడా రెండు నెలల్లో పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీబీజీ రామ్‌జీ కింద జల సంరక్షణ పనుల ద్వారా 38 లక్షల పనిదినాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

### పత్తికొండలో విజయగాథ

పత్తికొండ నియోజకవర్గంలో చేపట్టిన ట్యాంకుల పునరుద్ధరణ పనులు మంచి ఫలితాలు ఇచ్చాయని కలెక్టర్ తెలిపారు. పగిడిరాయి ట్యాంక్, జొన్నగిరి, చిన్న చెరువు, పెద్ద చెరువు, చెన్నంపల్లి తదితర ట్యాంకులకు అనుసంధానంగా ఉన్న సుమారు 4,500 మీటర్ల ఫీడర్ ఛానళ్లలో పూడిక, తుప్పలను తొలగించి నీటి ప్రవాహాన్ని



పునరుద్ధరించినట్లు చెప్పారు. గత 15 ఏళ్లుగా నిండని ఓ ట్యాంకు ఈ ఏడాది తక్కువ వర్షపాతం ఉన్నప్పటికీ ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పనుల కారణంగా 70 శాతం మేర నీటితో నిండిందన్నారు. మరో ట్యాంకు కూడా 20 ఏళ్లుగా నిండకపోగా, పూడిక తొలగింపు పనులతో 5 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం కలిగిన ట్యాంకు పూర్తిగా నిండిందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ శైలేశ్వర్, డ్వామా పీడీ నరసింహారెడ్డి, ఇరిగేషన్ డీఈ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
### సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తు
### మద్యం, నగదు, బహుమతుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా
### ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశాలు

కర్నూలు, అక్టోబర్ 8: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కర్నూలు నుంచి జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆర్వోలు, ఏఆర్వోల నియామకం, పోలింగ్ సిబ్బంది




కేటాయింపు, శిక్షణ, బ్యాలెట్ బాక్సులు, ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్లు తదితర అంశాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సుల రవాణా, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల సీసీ కెమెరా నిఘా, అవసరమైన చోట వీడియోగ్రఫీ, లాగ్‌బుక్‌ల నిర్వహణ తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. సమస్యాత్మక, అత్యంత సున్నిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో మద్యం అక్రమ రవాణా, నగదు, బహుమతులు, ఇతర ప్రలోభాలపై పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పెండింగ్ నాన్-బెయిలబుల్ వారెంట్లు ఉన్న వ్యక్తులపై నిబంధనల మేరకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించడం నుంచి కౌంటింగ్ వరకు ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. ప్రత్యేక మొబైల్ యాప్‌లు, రాష్ట్ర ఎన్నికల సంఘం పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి నామినేషన్లు, పోలింగ్ శాతం, ఫలితాలు, డిక్లరేషన్ వివరాలను నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.




### ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలి: కలెక్టర్

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికతో పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బంది వివరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్లు, ఎన్నికల సామగ్రి తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ అందించేందుకు మాస్టర్ ట్రైనర్లను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com